అధ్వానంగా రోడ్డు


రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


బురదమయంగా మారిన రోడ్డు

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏకు కూతవేటు దూరంలో ఉన్న ఒడ్డెరకాలనీ(12వవార్డు)లోని రోడ్డు బురదమయంగా మారింది. అక్కడ నివసిస్తున్న కుటుంబాలకు రోడ్డుపై కాలు తీసి కాలు వేసే పరిస్థితి లేదు. ఏవైపు చూసిన బురదనే దర్శనమిస్తోంది. రోడ్డుపై వర్షపు నీరు కూడా నిలుస్తోంది. గతంలో గెలుపొందిన వార్డు సభ్యులు, సర్పంచ్ సైతం తమ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని ప్రజలు ఆవేదనను చెందుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కాలనీలో మురుగుకాల్వలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. వర్షాకాలం వస్తే బురదమయంగా మారుతుంది. వాహనాలు దిగబడిపోతున్నాయి. ఇళ్లలోకి నడిచి వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు నిర్మించాలి.

- చెల్లం కుమారి, ఏటూరునాగారం

సైడ్ కాల్వలు నిర్మించాలి



తమ ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు బయటకు వెళ్లటం లేదు. కాల్వలు లేక వర్షపు నీరు కూడా రోడ్లపై నిల్వ చేరుతుంది. ఓట్లప్పుడు అన్ని చేస్తామన్నారు. ఇప్పుడు ముఖం చూపడం లేదు. వెంటనే సైడ్ కాల్వలు నిర్మించాలి.

- సీహెచ్ వెంకాయమ్మ, ఏటూరునాగారం

క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం



మంగపేట: ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన టీవీఆర్ సూరీని మండల చైతన్య ఆటోయూనియన్ అధ్యక్షుడు మహమూద్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు ఆదివారం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముందుగా ఎస్సైని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వేతనాలు లేక కార్మికుల అవస్థలు



ఏటూరునాగారం: మండలంలోని ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీలో సఫాయిలుగా పనిచేస్తున్న 16 మందికి మూడు నెలల నుంచి వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్య పనులు మరింత ఎక్కువ అయ్యాయి. ఉదయం నుంచి కష్టపడి పనిచేస్తున్న తమకు వేతనాలు ఇవ్వకుంటే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శి స్పందించి వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

కఠినంగా శిక్షించాలి

మంగపేట: ఆదివాసీ చెంచు మహిళను 10 రోజులుగా బందించి అత్యాచారం చేసి అత్యంత క్రూరంగా హింసించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సేన ములుగు డివిజన్ అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ చెంచు మహిళపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిసున్నమని పేర్కొన్నారు. ఈ సంఘటన ఓఎస్టీఓ ద్వారా వెలుగులోకి వచ్చిందని అనంతరం ఆదివాసీ, ప్రజా సంఘాల వత్తిడి మేరకు నిందితులపై పలు సెక్షన్లపై కేసునమోదు అరెస్టు చేసినప్పటికీ నిందితులను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి సంఘటనలు మరెక్కడ చోటు చేసుకోకుండా ఉండే విధంగా నిందితులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లిలో నేడు (సోమవారం) వారసంత ప్రారంభోత్సవానికి రావాలని ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఆహ్వాన పత్రాన్ని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాసారపు సదానందం, మాజీ సర్పంచ్ నల్లబెల్లి రవీందర్, ఎంపీటీసీ ఏనుగు లచ్చిరెడ్డి ఉన్నారు.

రోడ్డు పక్కన వాహనాలు నిలుపొద్దు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు


ప్రయాణికుల వివరాలను తెలుసుకుంటున్న ఎస్సై

ఏటూరునాగారం: రోడ్డు పక్కన వాహనాలు నిలుపొద్దని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం వారు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలించి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. రోడ్డు పక్కన తమ వాహనాలను నిలుపరాదని, ప్రమాదాలు నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఏటూరునాగారం వై జంక్షన్ 163వ జాతీయ రహదారి వద్ద రోడ్డుకు ఇరువైపులా ఇసుక లారీలు, ఇతర వాహనాలు నిలుపకూడదని, వాహనాలను ఇష్టం వచ్చినట్లు నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా రహదారి పక్కన నో పార్కింగ్ ట్రైర్లను ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. వాహనాలు నిలిపివే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. ఎస్సై ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని బస్టాండు ప్రధాన కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యాజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరించిన అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాల నిర్మూలనకు వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ములుగు రూరల్: పార్లమెంట్ ఎన్నికల విధులకు వెళ్లి ప్రమాదవశాత్తు గాయాలపాలై మృతి చెందిన వెంకటాపురం(ఎం) మండలం బూర్గుపేట ఆశ్రమ పాఠశాల హిందీ పండిట్ పోరిక మధుకుమార్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం మదనపల్లిలో మధుకుమార్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి యూటీఎఫ్ సహాయ నిధి నుంచి రూ.60 వేలను ఆర్థిక సాయంగా అందించారు. ఆయన వెంట యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి, గొప్ప సమ్మరావు, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరిక సర్వన్‌కుమార్, అనంతరాం, రాంకుమార్, తదితరులు ఉన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగు రూరల్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పార్టీ కార్యాయలంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసంఘ్‌ను స్థాపించి దేశంలో బ్రిటీష్, కాంగ్రెస్, ముస్లీం ఆదిపత్యాన్ని వ్యతిరేకించిన నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాదం కుమార్, భూక్య జవహర్‌లాల్, సురేందర్, రవింద్రాచారి, కృష్ణాకర్, నాగరాజు, మహేందర్, రవిరెడ్డి, శ్రీహరి, హేమాద్రితో పాటు తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులకే కరెంట్ కట్

పలిమెల: వర్షంకాలం మొదలైందో లేదో మండలంలో చిరు జల్లులకే కరెంట్ కోతల సమస్యలు మొదలైయ్యాయి. మండలంలోని సర్వాయిపేటలో సబ్‌స్టేషన్ ఉండగా దీని ద్వారా పంకెన, నీలంపల్లి ఫీడర్లు (విద్యుత్ లైన్లు) ఏర్పాటు చేశారు. పంకెన ఫీడర్ కింద పలిమెల, కామన్‌పల్లి, అప్పాజీపేట, బొడాయిగూడెం, పంకెన, మోదేడు గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. నీలంపల్లి ఫీడర్ కింద దమ్మూరు, బూరుగ్గూడెం, నీలంపల్లి, ముకునూర్, టేమెటిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నడుస్తుంది. ఆయా గ్రామాల పరిధిలో ఏ చిన్న గాలి దూమారం వచ్చిన, వర్షం కురిసిన, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ కొట్టేసిన ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లే. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి సర్వాయిపేట మినహా ఏ గ్రామంలోనూ ఆదివారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కనీసం మండల కేంద్రానికైనా ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు


వాజేడు: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై హరీశ్


వెంకటాపురం(కె): సీతారామ్‌పురంలో..

వాజేడు: ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దని వాజేడు, పేరూరు ఎస్సైలు రుద్రారపు హరీశ్, గుర్రం కృష్ణ ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని బిజినేపల్లిలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ కాలంచెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్న విప్లవ పార్టీలకు సహకరించవద్దన్నారు. మావోయిస్టుల మూలంగా ప్రజలకు నష్టమే తప్ప ఏ విధమైన లాభం లేదన్నారు. గ్రామ పరిసరాల్లో ఎవరైన అనుమానితులు, కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఏటూరునాగారం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదుని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం మండలంలోని గోగుపల్లి గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వర్షాకాలం వస్తున్నందున శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివాసం ఉండకూడదన్నారు. అసంసాంఘిక శక్తులకు ఎవరూ కూడా ఆశ్రయం ఇవ్వొద్దని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆదివాసీ ప్రజలకు పోలీసులు ఎప్పుడూ తోడుగా ఉంటారన్నారు. వాగులు పొంగి వాగులు ఉధృతంగా ప్రవహించే సమయంలో ఎవరు దాటనికి ప్రయత్నించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై తిరుపతి రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బోదాపురం పంచాయతీ సీతారామ్‌పురం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయో వర్షాకాలం సీజన్‌లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున గ్రామస్తులు ఈతకు, చేపలను పట్టిందుకు వెల్లవద్దని సూచించారు.

నేటినుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏటూరునాగారం: ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడెం వరకు 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏటూరునాగారం, కన్నాయిగూడెం రెండు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ములుగు విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతరాయం సోమవారం నుంచి బుధవారం ఉంటుందన్నారు. మరమ్మతుల సమయంలో వర్షం పడితే మరో రోజు సమయం తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.

కూలిపోయిన కల్వర్టు స్లాబ్


కాల్వపై కూలిపోయిన స్లాబ్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 5వ వార్డులో మురుగు కాల్వపై వేసిన కల్వర్టు స్లాబ్ పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. కల్వర్టును 2013లో నిర్మించారు. అయితే వాహనాల రాకపోకలకు కాల్వపై వేసిన కాంక్రీట్ బిల్లలు ఇరిగిపోయి కాల్వపై నుంచి వాహనాలు, ప్రజలు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. రాత్రివేళలో సైతం కాల్వపై నుంచి నడిచేవారు కాల్వలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ఈ కాల్వల స్లాబ్‌పై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుకే పలిమెల మండలం

- మహదేవపూర్‌లోనే కొనసాగుతున్న కార్యాలయాలు
- ప్రజలకు తప్పని తిప్పలు
- నిరుపయోగంగా మండల సమీకృత భవనం


నిరుపయోగంగా ఉన్న మండల కార్యాలయాల సమీకృత భవనం

పలిమెల: జిల్లాలు, మండలాల పునర్విభజన సమయంలో పలిమెల నూతన మండలంగా ఏర్పడి 9 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికి మండల ప్రధాన కార్యాలయాలు ఉమ్మడి మండల కేంద్రమైన మహదేవ్‌పూర్‌లోనే కొనసాగుతున్నాయి. మండలంగా ఏర్పడిన ప్రజలకు మాత్రం సేవలు అందడం లేదనే చెప్పుకోవాలి. చిన్నపాటి పనికైనా ఎంతో వ్యయప్రయాసాలతో రోజుల తరబడి తిరగాల్సి వస్తుంది.

భవనాలు నిరుపయోగం..

మండలం ఏర్పాటు చేసిన సమయంలో మండలం కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో ఆయా శాఖల ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేసి సుమారు 2 సంవత్సరాలు పాటు మండల కేంద్రంలోనే కొనసాగించారు. కాని 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అప్పటి అధికారులు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేదనే సాకుతో మహదేవపూర్ కేంద్రంగా కార్యాలయాలు ఏర్పాటు చేసుకొని ఎన్నికల అయ్యే వరకు కొనసాగిస్తామని కలెక్టర్ వద్ద అనుమతి తీసుకున్నారు. 2018తో పాటు 2023 అసెంబ్లీ ఎన్నికల పూర్తయిన నేటి కార్యాలయాలను ఇక్కడికి తరలించకుండా వారికి అనుకూలంగా ఉంటుందని అక్కడే తిష్టవేశారు. మండల ఏర్పాటు అనంతరం అప్పటి కలెక్టర్ మండల కేంద్రంలో మండల కార్యాలయాల సమీకృత భవనాన్ని కలెక్టర్ ప్రత్యేక నిధులు నిర్మించారు. అనతికాలంలోనే అందుబాటులోకి వచ్చినప్పటికీ అధికారులు మాత్రం మహదేవపూర్‌ను విడటం లేదు. కార్యాలయాలు అందుబాటులోకి లేకపోవడంతో విద్య, వైద్య, రెవెన్యూ, తదితర శాఖ సమస్యలు పేరుకుపోతున్నారు. ప్రజలు అనేక వ్యయప్రయాసాలు వెచ్చించి మహదేవపూర్‌కు వెళ్లాల్సి వస్తుంది. కనీసం కులం, ఆదాయం సర్టిఫికేట్‌లు కావాలన్న వందలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. ప్రభుత్వ పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్న వాటి అమలుకు అధికారులు అందుబాటులో ఉండేలా కార్యాలయాలు ఏర్పాటు కీలకం. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అప్పుడప్పుడు మండలంలో పర్యటించినా స్థానికులు వారికి కార్యాలయాల ఏర్పాటు విషయంపై ఎన్నిసార్లు విన్నవించినా పట్టింపులేన్నట్లు వ్యవరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దీంతో సమస్యలు పరిష్కారించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులే వారి గోడు వినకపోవంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక వారు ఆవేదన చెందుతున్నారు.


ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయం (ఫైల్)

వెంటనే తరలించాలి



మండల ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పాత మండలంలోనే ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలానికి సంబంధించిన ఆయా కార్యాలయాలను మండల కేంద్రానికి తరలించాలి. దీనిపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- జనగామ సుధాకర్, పలిమెల

మహదేవపూర్‌కు వెళ్లాల్సిందే..



మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు మహదేవపూర్‌కు తరలించడంతో ఏ చిన్న పనికావాలన్న అక్కడి వెళ్లాల్సి వస్తుంది. సమయానికి అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండకపోవడంతో రోజుల తరబడి తిరగాల్సిందే. దీంతో పనులు వదిలి పెట్టుకోని, రూ.వందలాది ఖర్చు చేస్తే తప్పా పనులు కావడం లేదు.

- పొనెం బాలు, పంకెన

వ్యసనాలకు దూరంగా ఉండాలి

కాటారం: యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కాటారం డీఎస్పీ గద్దం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మండల కేంద్రంలోని గంటగూడెం, తెనుగవాడలో ప్రజలు, యువకులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. యువత గంజాయి, మద్యం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలన్నారు. ఉద్యోగ సాధనే ధ్యేయంగా ముందుకు కదిలి కుటుంబ ఆర్థిక సమస్యలను అధిగమించేలా ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. నేరాల్లో ప్రమేయమై మంచి భవిష్యత్‌ను కోల్పోవద్దని తెలిపారు. గంజాయికి అలవాటుపడిన, సప్లై చేస్తున్న వారి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి కారణంగా యువత జీవితాలు అంధకారమైతున్నాయన్నారు. గంజాయికి అలవాటుపడిన వారిని పునరావాసా కేంద్రాలకు పంపించి సరైన చికిత్స చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం ఎస్సై-2 హరిశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం


క్షీరాభిషేకం చేస్తున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: ఎన్నికలకు ముందుకు వరంగల్ డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ సమక్షంలో రాష్ట్ర రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి, రైతుల కళ్లల్లో ఆనందం నింపడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని, గత ప్రభుత్వం ఎన్నికల హామీలను 10 సంవత్సరాలలో పూర్తి చేయలేదని ఎద్దేవ చేశారు. భవిష్యత్‌లో రాష్ట్రం అభివృద్ధిలో కొనసాగుతుందని మరిన్ని సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, నాయకులు వైనాల రవీందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌పాణి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, భూమిరెడ్డి, రమేష్, తోడేటి కుమార్, వంగ కుమారస్వామి, గునిగంటి మహేందర్, కుర్రె మల్లయ్య, కోరె చందు, చిరంజీవ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

ఏటూరునాగారం: విద్యుదాఘాతానికి పాడిగేదె మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని కోయగూడ ఎల్లాపురం(రాంనగర్) గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గార వెంకటేశ్వర్లు రైతుకు చెందిన పాడిగేదె మేత కోసం వెళ్లి పొలాల్లోకి వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొంది.